ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

డిఇఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశామని డిఇఒ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. పలాస మండలం పెద్దంచల జెడ్‌పిహెచ్ స్కూల్ ఎస్‌జిటి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న బెహరా మాధవరావు రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఫిర్యాదు రావడంతో పలాస రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ భరత్ నాయక్ విచారణ చేపట్టి దానిని ధ్రువీకరించారని అన్నారు. అలాగే సారవకోట మండలం మొగుపురం ఎంపిపిఎస్ స్కూల్ విధులు నిర్వహిస్తున్న చౌదరి లక్ష్మీనారాయణ వాట్సాప్‌లో ఎన్నికల ప్రచారం చేసినట్లు మండలం విద్యాశాఖాధికారి ధ్రువీకరించడంతో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు స్పష్టం కావడంతో ఇరువురినీ సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

ఉప్పు సాగు చేయక వదిలేసిన గల్లీలు

ఉప్పు రైతుకు ఉపాధి ముప్పు

పనుల్లేక కార్మికులు, కూలీల అవస్థలు

నౌపడలో పండించిన ఉప్పు

ప్రజాశక్తి- నౌపడ

నౌపడ ఈ పేరు వినగానే గుర్తొచ్చేది ఉప్పు పరిశ్రమ. గతంలో సుమారు ఐదు వేల కుటుంబాలు ఈ పంటపై ఆధారపడి జీవనం సాగించేవి. ప్రస్తుతం ఆ సంఖ్య వందల్లో ఉంది. మూడేళ్లగా రైతులు, కార్మికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వలస కూలీలకు ఆశించిన స్థాయిలో పనులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నౌపడ, ఇచ్ఛాపురం, పూండి, మర్రిపాడు, సెలగపేట, కళింగపట్నం, సీతానగరం, యామాలపేట, మూలపేట ప్రాంతాల్లో సుమారు ఐదు వేల ఎకరాల వరకు రైతులు ఉప్పు పండించి రాష్ట్రంతో పాటుగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే వారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఉప్పు భూములు లీజు కాలపరిమితి ముగియడంతో రైతులు ఎవరు ఉప్పు పండించేందుకు ముందుకు రావడం లేదు. అక్కడక్కడ కొందరు రైతులు ఉప్పు పండిస్తున్నా వాతావరణం మార్పు, అధిక పెట్టుబడి, దళారులు చేతివాటంతో నష్టపోతున్నారు.

ధర పలికినా దిగుబడి లేదు

సంతబొమ్మాళి మండల పరిధి తీర ప్రాంత గ్రామాల్లో పేద కుటుంబాలు ఉప్పు పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఏటా డిసెంబరులో పనులు ప్రారంభించి జూన్ చివరి నాటికి పూర్తి చేస్తారు. వాతావరణం అనుకూలించకపోవడం, స్థానిక పరిస్థితుల నేపథ్యంలో పదేళ్లుగా ఉప్పు ఉత్పత్తి తగ్గింది. ఈ సీజన్లో పంటకు ధర ఉన్నా దిగుబడి లేదు. నౌపడలో 250 మంది ఉప్పు ఉత్పత్తిదారుల అనుమతులు పునరుద్ధరించక పోవడంతో ఈ ఏడాది ఉప్పు సాగుపై ఆసక్తి చూపలేదు. గతంలో 50 వేల మెట్రిక్ టన్నుల ఉప్పు ఉత్పత్తి అయ్యేది. ప్రస్తుతం 10 వేల మెట్రిక్ టన్నులకు పడిపోయింది. ప్రస్తుతం 50 కిలోల బస్తా రూ.150-250 వరకు పలుకుతోంది.

వలస కూలీలుగా మారిన కార్మికులు

ఏటా జనవరి నుంచి జూన్ వరకు రోజూ ఉప్పు మడుల్లో పనిచేసే ఉప్పు కార్మికులు, పలువురు రైతులు వలసలు పోయి కూలి పనులు చేసుకుంటున్నారు. చెన్నయ్, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో తాపీ పనులు, రైస్ మిల్లుల్లో, కళాసీలుగా పనిచేసుకుంటున్నారు. అంతేకాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఉక్కు పండించేందుకు ఇక్కడికి వచ్చిన కార్మికులు కూడా పనులు లేక సొంతూర్లకు వెళ్లిపోతున్నారు. రాజస్థాన్ వచ్చిన కూలీలు ట్రాక్టర్లు, డోజర్లు, ప్రొకెక్లయిన్లకు పనులు నిత్యం చేస్తూ ఉండేవారు. వారికీ పనులు లేకపోవడంతో వెనక్కి వెళ్లిపోయారు. ఈ ప్రాంతంలో ఉప్పు పంటే ఆధారం. దీంతో చేసేది ఏమీ లేక వలస కూలీలుగా మారిపోతున్నారు. అక్కడి పనులు అలవాటు లేక ఇబ్బంది పడుతున్నారు. ఒకప్పుడు కార్మికులకు చేతినిండా పని ఉండేది. ఈ వంద మందిలో నలుగురికి మాత్రమే ఉపాధి దొరికే పరిస్థితి ఉంది.

ఉపాధి చూపాలి

ఈ ఏడాది ఉప్పు సాగు ఆశించిన స్థాయిలో లేదు. సీజన్‌లో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి ప్రజలకు గ్రామాల్లో ఉపాధి చూపాలి. గ్రామీణ ఉపాధి హామీ పనులూ సక్రమంగా ఇవ్వడం లేదు. అధికారులు స్పందించాలి.

- కర్రి చిన్నబాబు, నౌపడ

ఉపాధి లేక వలసలు పోతున్నారు

ప్రధానంగా ఉప్పు పంటపై గిట్టుబాటు లేదు. ఏటా వర్షాలు, తుపాన్లకు నష్టపోతున్నాం. మరో వైపు లీజు ముగియడంతో వలసలు అధికమవుతున్నాయి. లీజు గడువు పొడిగించాలి. పంటకు తగినంత గిట్టుబాటు ధర కల్పించినట్లయితే వలసలు తగ్గి, మళ్లీ పంటకు పూర్వవైభవం వస్తుంది.

- కర్రి కాంతారావు, ఉప్పు ఉత్పత్తి లైసెన్స్ దారుడు

ఎన్నికల నిర్వహణలో పిఒ, ఎపిఒలే కీలకం

శ్రీకాకుళం అర్బన్ : శిక్షణలో మాట్లాడుతున్న మనజీర్ జిలానీ సమూన్

- 90 నిమిషాల ముందే మాక్ పోల్
- ఇసి ఆదేశాలు కచ్చితంగా అమలు
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి

ఎన్నికల నిర్వహణలో పిఒ, ఎపిఒ కీలక పాత్ర, పిఒల విధులు అత్యంత ప్రతిష్టాత్మకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. నగరంలోని అనందమయి ఫంక్షన్ హాల్లో శ్రీకాకుళం నియోజకవర్గం ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శనివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఒ విధులు నిర్వహించడం గొప్ప అవకాశమని, ఈ అవకాశాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఒక్క తప్పు జరగకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఇవిఎంలు, వివి ప్యాట్ల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పిఒల పాత్ర అత్యంత కీలకమన్నారు. పోలింగ్ రోజున, కేంద్రం పరిధిలో ఆయనకే పూర్తి అధికారులు ఉంటాయన్నారు. పోలింగ్ సిబ్బంది విధులపైనా పిఒలకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఈసారి ఎన్నికల్లో రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టిపరిస్థితి లోనూ పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ఉదయం నుంచే వీలైనంత వేగంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పిఒ నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత అభిప్రాయాలను ఎక్కడా ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి అనుమానాలు ఉత్పన్నమైన జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనీస్, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనీస్‌ని అడిగి అనుమానాలు నివృత్తి చేసుకోవాలన్నారు. హింసకు తావులేకుండా, ఎన్నికలు తిరిగి నిర్వహించే అవసరం రాకుండా (జీరో వయలెన్స్.. నో రీపోల్), పూర్తి స్వేచ్ఛగా, సజావుగా ఈ దఫా సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యమని అన్నారు. ఇదే లక్ష్యంతో కృషి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో పోలింగ్‌కు 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్‌పోల్ నిర్వహించాలని ఆదేశించారు. మాక్ పోల్ అనంతరం ఇవిఎంలు డిలీట్ చేయాలని, వివి ప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్లుగా వాలంటీర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. హ్యాండ్ బుక్, చేయాల్సిన, చేయకూడని జాబితా, చెక్‌లిస్టులను తమతో పాటు ఉంచుకోవాలన్నారు. ముందు రోజు రాత్రే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 5.30కే మాక్ పోల్ జరుగుతుంది అన్నారు. అందుకు ముందురోజు రాత్రే బూత్‌లో ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. మూడు విడతల్లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. పిఒలు ఫారం 17 సి, పిఒ డైరీ, పిఒ రిపోర్ట్, పిఒ డిక్లరేషన్లను తప్పులు లేకుండా, కచ్చితమైన వివరాలతో నింపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డివిజనల్ రెవిన్యూ అధికారి సిహెచ్.,రంగయ్య, తహశీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస శ్రీనివాస కళ్యాణ మండపంలో పిఒలకు, ఎపిఒలకు ఓటింగ్ శాతం పెంపునకు, ఎన్నికల నిర్వహణపై శిక్షణ జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ ఇచ్చారు. 12 మంది అసెంబ్లీ ట్రైన్ మాస్టర్లు అందిస్తున్న ఈ శిక్షణలో ఎటువంటి సందేహాలు ఉన్న ఇక్కడే నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ శిక్షణలో 730 మంది హాజరు కావాల్సి ఉందగా... 32 మంది గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జెసి ఎం.నవీన్, నాలుగు మండలాల తహశీల్దార్లు కె.వేణుగోపాల్, పి.రమేష్‌బాబు, అంబేద్కర్, కిరణ్‌పాల్ పాల్గొన్నారు.

నరసన్నపేటనియోజకవర్గానికి సంబంధించి ఎస్ఎఆర్ కళ్యాణ మండపంలో ఎన్నికల నిర్వహణపై పిఒలకు, ఎపిఒలకు ఇచ్చిన శిక్షణా తరగతుల్లో జిల్లా ఎన్నికల అధికారి పాల్గొని అవగాహన కల్పించారు.

టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి ఆదిత్య కళ్యాణ మండపంలో పిఒలకు, ఎపిఒలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి పాల్గొని పలు సూచనలు చేశారు.

ఎండల తీవ్రత దృష్ట్యా అప్రమత్తం

- మండలాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వేసవి వేడి గాలుల తీవ్రత పెరిగే సూచనల దృష్ట్యా విపత్తు నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేయాలని, అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్‌లను తెరవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రాబోయే వడ గాలుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విపత్తు నిర్వహణపై జిల్లా అధికారులతో కలిసి తహశీల్దార్లు, ఎంపిడిఒలతో కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ గాలుల కారణంగా జిల్లాలో ఏ ఒక్కరూ మృతి చెందకుండా చూడటమే లక్ష్యమని అన్నారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటికే పలు సూచనలు చేశామని, వాటిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నీటి టాంకర్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రధాన కూడళ్లలో, బస్టాండ్‌ల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అగ్నిమాపకశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలకు కనీస అవసరాలు సమకూర్చాలన్నారు. ప్రాథమిక చికిత్స కిట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. వీటికి ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. అన్ని అంగన్వాడీ కేంద్రాలకు ప్యాకెట్ల సరఫరా చేయాలన్నారు. మండలాల్లో క్యాంపులు నిర్వహించి పశువులకు మేత, తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఎండ తీవ్రత అధికంగా ఉన్న రోజుల్లో ప్రజలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని సూచించారు. ఆర్‌టిసి అధికారులు తమ సిబ్బందికి జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. ఈత పేరుతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు పునరావృతం కాకుండా నిరంతరం అప్రమత్తం చేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు వేసవి కాలంలో నిర్వహించాల్సిన బాధ్యతలను గురించి విద్యాశాఖ అధికారులు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. సమావేశం డిఆర్ఒ ఎం.గణపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ప్రకృతి విపత్తుల సంస్థ నుంచి పి.రాము, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్, సిపిఒ ప్రసన్నలక్ష్మి, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, జిల్లా ట్రాన్స్‌ఫోర్టు అధికారి ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మోహనరావు, అర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ జెడి కిషోర్ పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

మాట్లాడుతున్న సింహాచలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న కూలిని తక్షణమే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు గడచిన ఐదారు వారాల నుంచి కూలి చెల్లించడం లేదని, దీనివల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కో వాల్సి వస్తోందని అన్నారు. రెక్కాడితే గానిడొక్కాడని పేద ప్రజలకు వారాలు తరబడి కూలి చెల్లించకపోతే కూలీలు ఎలా జీవిస్తారని వారు ప్రభుత్వానికి ప్రశ్నించారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు వంద రోజులు పూర్తికాని వారికే పని కల్పిస్తుందని, వంద రోజులు పూర్తయిన వారు పనులు లేక పస్తులతో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మరో వైపు వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, అందువల్ల పనిప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్లు కల్పించాలన్నారు. రెండు పూటల పని రద్దు చేసి ఒంటిపూట పని పెట్టాలని అన్నారు. 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600 కనీస కూలి చెల్లించాలన్నారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెంచాలన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం కూలీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గంగరాపు ఈశ్వరమ్మ, కొల్లి ఎల్లయ్య, మంగమ్మ, సింహాచలం, విజయ, నరసమ్మ, లక్ష్మణరావు, నీలవేణి, నరసింహులు పాల్గొన్నారు.

నగరంలో 'ఫ్లాగ్ మార్చ్'

ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రానున్న ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేల భరోసా కలిగించడమే ఫ్లాగ్ మార్చ్ ప్రధాన లక్ష్యమని టూ టౌన్ సిఐ ఉమామహేశ్వరరావు అన్నారు. నగరంలో బలగ కూడలి నుంచి ఎసిబి కార్యాలయం నుంచి స్టేట్ బ్యాంకు వరకు కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా, శాంతి భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడినా నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎక్కడ విఘాతం కలిగినా ప్రజల్లో భరోసా, ధైర్యం కల్పించడం లక్ష్యంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామనిచెప్పారు. సమాజంలో అసాంఘిక కార్యక్రమాలు ప్రజలకు ఇబ్బంది కలిగించే సంఘటనలు ఎవరు సృష్టించినా తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపట్నుంచి 'కేంద్రీయ' ప్రవేశాలకు రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఏప్రిల్ 15 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి వయసు మార్చి ఒకటి నాటికి ఆరేళ్లు నిండి ఉండాలన్నారు. అంతకంటే తక్కువ వయసు ఉంటే విద్యార్థుల అడ్మిషన్ తిరస్కరణకు గురవుతుందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారి తొలి ప్రొవిజినల్ లిస్ట్‌ను ఏప్రిల్ 19న ప్రకటిస్తామన్నారు. సీట్లు ఖాళీని బట్టి రెండో ప్రొవిజినల్ జాబితాను ఏప్రిల్ 29న, మూడో ప్రొవిజినల్ జాబితాను మే 8న విడుదల చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు రెండు, ఆ పైతరగతుల్లో (ఇంటర్ మినహాయించి) ఖాళీగా ఉండే సీట్ల భర్తీకి ఏప్రిల్ 1 నుంచి 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెండో తరగతికి ఎంపికైన వారి జాబితాను ఏప్రిల్ 15న, మిగతా తరగతులన్నింటిలో అడ్మిషన్లకు జూన్ 29 తుది గడువుగా ప్రకటించినట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం కేంద్రీయ విద్యాలయం అధికారిక వెబ్‌సైట్ https://kvsangathan.nic.inను సందర్శించాలన్నారు. నాన్-రెసిడెంట్ ఇండియన్స్ (ఎన్ఆర్ఐ)కు చెందిన పిల్లల అడ్మిషన్ ఫారం అనుమతించబోమని తెలిపారు.

పార్టీకి నష్టం చేకూర్చే చర్యలు మంచిది కాదు

మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ

అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టిడిపి ఆవిర్భావం నుంచి క్రమశిక్షణ గల కార్యకర్తలు పనిచేస్తున్నారని, వారిని విస్మరించి అసమ్మతి వాదులను అక్కున చేర్చుకుని పార్టీకి నష్టం చేకూర్చే చర్యలను ప్రోత్సహించడం రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడికి తగదని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ధ్వజమెత్తారు. అరసవల్లిలోని ఆయన నివాసం వద్ద శనివారం విలేకరులతో మాట్లాడారు. వ్యక్తులపై చూపించే శ్రద్ధ పార్టీ ప్రయోజనాలపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. ఆయనకు రాష్ట్ర అధ్యక్షుని పదవిని కట్టబెట్టినప్పుడు జిల్లా నాయకత్వం ఎంతగానో ఆనందపడిందని, కానీ, ఆ ఆనందాన్ని మిగల్చకుండా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అసమ్మతిని ప్రోత్సహించారని విమర్శించారు. జిల్లాలో పార్టీకి నష్టం చేకూరుస్తారని భావిస్తే రాష్ట్ర పార్టీ బాధ్యతలు అప్పగించినప్పుడే అసంతృప్తి వ్యక్తం చేసేవారని అన్నారు. నాయకత్వ బాధ్యతల్లో ఉన్న వారు వ్యక్తిగత ప్రయోజనాలు కన్నా పార్టీ ప్రయోజనాలు కాపాడే వారై ఉండాలన్నారు. చంద్రబాబు చేస్తున్న కృషిని కొనియాడారు.

నేల విడిచి సాము

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా రాజకీయాల్లో విచిత్రమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్, టిక్కెట్ల కేటాయింపు తర్వాత ప్రధాన రాజకీయ పార్టీల్లో రెండు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. సిట్టింగ్‌లపై తీవ్ర వ్యతిరేకత, గ్రూపుల పోరుతో సతమతమైన వైసిపి క్రమేణా సానుకూల పరిస్థితుల దిశగా సాగుతున్నట్లు కనిపిస్తోంది. జిల్లాలో ఒకట్రెండు చోట్ల మినహా అన్ని సీట్లను గెలిచేస్తామని ఊపు మీద ఉన్న టిడిపి ప్రస్తుతం ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కుంటోంది. ఇదంతా టిడిపి చేసుకున్న స్వయంకృతాపరాధమే అని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. పొత్తులు, టిక్కెట్ల కేటాయింపులో క్షేత్ర స్థాయి పరిస్థితులను బేరీజు వేయలేకపోవడం పార్టీకి ఈ రకమైన స్థితి ఎదురైందనే అభిప్రాయం వినిపిస్తోంది. ప్రధానంగా టిక్కెట్ల కేటాయింపులో చేసిన తప్పిదాలు ఓటమిని కోరి కొని తెచ్చుకున్నట్లుగా ఉందని పార్టీ శ్రేణులు ఆవేదన చెందుతున్నాయి. పాతపట్నం, శ్రీకాకుళం స్థానాల్లో పార్టీ ఇన్‌ఛార్జిగాలు ఉన్న సీనియర్లను తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వడాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆ రెండు నియోజకవర్గాల్లో అసమ్మతిని రాజేసి చివరకు అసమ్మతి నాయకులకే సీట్లను కట్టబెట్టారన్న విమర్శలను జిల్లా టిడిపి పెద్దలు మూటకట్టుకున్నారు. సీనియర్ నేత కిమిడి కళా వెంకటరావును ఎచ్చెర్ల నుంచి విజయనగరం జిల్లా చీపురుపల్లికి బదిలీ చేయడంపై నియోజకవర్గ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పార్టీ పదవులకు సైతం రాజీనామా చేయడానికి సిద్ధమయ్యారు. ఎచ్చెర్లలో ఈ నెల 30న సమావేశమై తర్వాత మనసు మార్చుకుని పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటించారు.

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్చడంలో టిడిపి ఏకపక్షంగా వ్యవహరించిందన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. అభ్యర్థుల ప్రకటనకు ముందు మిమ్మల్ని సంప్రదిస్తామని చెప్పిన మాట మాత్రంగానైనా చంద్రబాబు తమతో చెప్పలేదని నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు అవమానభారంగా భావిస్తున్నారు. శ్రీకాకుళం, పాతపట్నంలో కేడర్ అంతా ఇన్‌ఛార్జీల వెంట ఉండగా కొత్త అభ్యర్థులకు టిక్కెట్లు ఇవ్వడం పార్టీ శ్రేణులను విస్మయానికి గురి చేసింది. పైగా అసమ్మతి నాయకులకే సీట్లు కేటాయించడంపై గుండ, కలమట వర్గీయులు మండిపడతున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ ఆత్మీయ సమావేశాల పేరుతో కార్యకర్తలతో సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తూ తమ మద్దతుదారులు దూరం కాకుండా జాగ్రత్త పడుతున్నారు. పార్టీ అధిష్టానం ఏ సమయంలోనైనా తన నిర్ణయం మార్చుకోవచ్చన్న ఆశతో వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు. అభ్యర్థుల ప్రకటనకు సంబంధించి ఇదే ఫైనల్ అయితే మాత్రం నిర్ణయాలు వేరే రకంగా ఉండొచ్చన్న చర్చ కేడర్‌లో నడుస్తోంది. శ్రీకాకుళం నియోజకవర్గంలో గుండ కుటుంబం ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధంగా లేకున్నా... పాతపట్నంలో మాత్రం కలమట వెంకటరమణ ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలనే యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రెండుచోట్ల ఇన్‌ఛార్జీలు ఇండిపెండెంట్లుగా పోటీ చేసినా తటస్థంగా ఉన్నా పార్టీకే నష్టం కలిగే పరిస్థితి నెలకొంది. ఎచ్చెర్ల టిక్కెట్‌ను బిజెపికి కేటాయించడం, సీనియర్ నేత కిమిడి కళా వెంకటరావును చీపురుపల్లికి పంపడంతో పార్టీ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. ఇక్కడ బిజెపి అభ్యర్థికి ఎంత మేరకు సహకరిస్తారనేది చూడాల్సి ఉంది.

టిడిపి టిక్కెట్ల ప్రకటనకు ముందు ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో వైసిపికి గడ్డు పరిస్థితి ఉండేది. సిటింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇరువురిని మార్చాలంటూ డిమాండ్లు వచ్చాయి. ఆ రెండుచోట్ల అభ్యర్థులను మార్చకపోతే ఓడిస్తామంటూ ప్రకటనలు సైతం చేశారు. పార్టీ అధిష్టానం మాత్రం ఎటువంటి మార్పులు చేయకుండా వారికే మళ్లీ టిక్కెట్లు కేటాయించింది. టిక్కెట్ల కేటాయింపు తర్వాత విచిత్రంగా అసమ్మతి నాయకులెవరూ బయటకు రాలేదు. ఇదే సమయంలో అంతా బాగుందని భావించిన టిడిపి, దాని మిత్ర పక్షం బిజెపికి అసమ్మతి జ్వాలలు తాకాయి. టిక్కెట్లు కేటాయించడంలో టిడిపి ఏకపక్షంగా వ్యవహరించిన తీరే దీనికి కారణమనే వాదన వినిపిస్తోంది. పలు జాతీయ సర్వేల్లో టిడిపికి మెజార్టీ సీట్లు వస్తాయనే అంచనాలతో టిడిపి గెలుపు భ్రమల్లో తేలియాడుతోంది. నేల విడిచి సాము చేస్తోంది. అభ్యర్థి ఎవరనేది కాదని, పార్టీ బట్టి ఓటేస్తారని భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఈ కారణం చేతనే సీనియర్ నేతలను కాదని కొత్త వారితో ప్రయోగాలకు దిగిందనే చర్చ సాగుతోంది.

క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయడంలో టిడిపి విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గాల్లో అభ్యర్థిత్వాలను ఖరారు చేయటానికి ఆ పార్టీ ఐవిఆర్ఎస్ సర్వేనే నమ్ముకుంది. పాతపట్నం, శ్రీకాకుళం అభ్యర్థుల ఎంపిక కోసం మూడు నాలుగు పర్యాయాలు సర్వే కోసం ఫోన్ల ద్వారా ప్రజల అభిప్రాయాన్ని తీసుకుంది. జనంతో పాటు వైసిపి కేడర్‌కూ ఆప్షన్లు అడగడంతో వారు మాత్రం టిడిపి నుంచి ఎవరు పోటీ చేస్తే తమ నేత గెలవగలరో గుర్తించి, వారికే ప్రాధాన్యం ఇచ్చారు. అదే సర్వే ఆధారంగా టిడిపి తన అభ్యర్థులను ప్రకటించి నియోజకవర్గాల్లో అసమ్మతి జ్వాలలు రేగడానికి కారణమైందన్న చర్చ నియోజకవర్గాల్లో సాగుతోంది. మరికొద్ది వారాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో నెలకొన్న గ్రూపుల పోరు, కేడర్‌లో అసమ్మతి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తుందని కేడర్ ఆందోళన చెందుతోంది. పరిస్థితులను చక్కదిద్దకపోతే పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని వారు అంటున్నారు. మరికొద్ది వారాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధిష్టానం ఏం చర్యలు తీసుకోబోతోందనే వేచిచూడాల్సి ఉంది.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.A190/2023 IN O.S 340/2018

Between:- **Guttu Butchiraju,**
--Petitioner/Plaintiff.
And:- **Gunta Srinivasan (Died)**
--Respondent/defendant.

To,
R-3: Gunta Narendra Kumar, S/o late Srinivasan, aged about 25 years, Hindu, Private Employee, resident of Door No.0-166, Gudem Veedhi, Ragolu Village, Srikakulam Rural Mandal, Srikakulam district.

పై నెంబర్ కేసులో Petitioner/Plaintiff సదరు ప్రతివాది మరణించునందున తన వారసులను పైనెంబరు గల కేసులో ప్రతివాదులుగా (వారసులుగా) చేర్చమని కోరుతు పిటిషన్ దాఖలు చేయడమైనది. ఇందు విషయమై సదరు రెస్పాడెంట్-3 అయిన గుంటా నరేంద్రకుమార్, S/o లేటు శ్రీనివాసన్ గారికి ఎట్టి అక్షేపణలు, అభ్యంతరములు ఉన్నను పై కోర్టులో **తేది 02-04-2024దిన ఉ॥ 10.30 గం॥ లకు** స్వయంగా గాని మీ తరుపు అడ్వకేట్ ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీకు గల అక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమంద కేసు విచారించి తీర్మానించడమగును.

BODIGI RAMANA RAO
B.V.V.S. HARISH KUMAR
ADVOCATS,
SRIKAKULAM, PHONE NO: 9441095784.

మండల, పట్టణ అధ్యక్షులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నియోజకవర్గంలో వైసిపి విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శనివారం అక్కువరం సమీపంలో వైసిపి కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వైసిపికి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని, మీరు కూడా ప్రతి ఇంటికి వెళ్లి తన విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడ్డ మండల పార్టీ అధ్యక్షులు కిల్లి అజయ్ కుమార్, పట్టణ అధ్యక్షులు తమన్నగారి కిరణ్, యూత్ అధ్యక్షులు మురళీరెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో మహిళా విభాగ అధ్యక్షులు చింతాడ మంజు, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పిఎసిఎస్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రసాదరావు

రైస్‌మిల్లర్ల అసోసియేషన్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కిన్నెర కాంప్లెక్స్ ఎదురుగా పున:ర్మించిన రైస్ మిల్లర్ల అసోసియేషన్ భవనాన్ని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం ప్రారంభించారు. ఈ భవనంలో కొత్తగా నెలకొల్పిన టాటా గ్రూప్ వస్త్ర దుకాణ సముదా యాన్నీ ప్రారంభించారు. నగర స్థాయిని పెంచే విధంగా వాణిజ్య, వ్యాపారాభివృద్ధికి తమవంతు పూర్తి సహకారం అందిస్తున్నా మన్నారు. వ్యాపార సంస్థల రాకతో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు స్థానికంగా లభించనున్నట్టు తెలిపారు. వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ముందుకొచ్చిన రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులను మంత్రికి అభినందించారు. కార్యక్రమంలో రైస్ మిలర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, శాశ్వత గౌరవ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, జిల్లా అధ్యక్షులు ఆర్‌విఎస్ వెంకటేశ్వరరావు (వాసు), కార్యదర్శి కోరాడ వెంకట గోపాలకృష్ణ, తాళాసు కృషణరావు, డోకి మోహనరావు, ఐ.జనార్ధనరావు, అంధవరపు సూరిబాబు పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజల తాగునీటి అవసరాలను ఆసరాగా తీసుకొని నిబంధనలు గాలికొదిలేసి మినరల్ వాటర్ పేరుతో అపరిశుద్ధ నీటిని విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్న అక్రమ నీటి వ్యాపారాన్ని అరికట్టాలని ఎపిసిఎల్ఎ జిల్లా కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు సంబంధిత అధికారులకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసారు. అనుమతులు లేకుండా ఏర్పాటైన ఆర్ఓ ప్లాంట్‌లను వెంటనే మూసివేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్‌ను కోరారు. అక్రమ నీటి వ్యాపారంతో వ్యాపారులు ప్రజల దగ్గర నుంచి సొమ్ములను కొల్లగొట్టి ప్రజలను అనారోగ్యం బారిన పడవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనలు ఉల్లంఘించి మినరల్ వాటర్ పేరుతో అక్రమ నీటి వ్యాపారాన్ని నిర్వహిస్తున్న కేంద్రాలను సీజ్ చేసి అందుకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని అలాగే ప్రజారోగ్య పరిరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి అనధికార ఆర్ఓ ప్లాంట్లపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆయన కోరారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి- కంచిలి

వేసవిలో ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిపి దేవదాసు రెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. అలాగే పలు శాఖల పనితీరుపై అధికారులు తమ నివేదికలు తెలియజేశారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న అధికారులు

మృతుల కుటుంబాలకు పరిహారం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

చీపురుపల్లి పంచాయతీ అనకాపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇటీవల ఎలుగు దాడిలో చీడిపల్లి లోకనాథం, అప్పిరెడ్డి కూర్మారావు మృతి చెందిన విషయం విదితమే. ఆ కుటుంబాలకు శనివారం అటవీశాఖ అధికారులు పరిహారం అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.2.50 లక్షలు పరిహారం చెక్కు రూపంలో అందించారు. బాధిత కుటుంబాలకు మరో రూ.2.50 లక్షలు అందించడం జరుగుతుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. అటవీశాఖ నిర్లక్ష్యం వలనే ఉద్దానం ప్రాంతంలో ఎలుగుల దాడులు అధికమయ్యాయని, గత కొన్నేళ్లుగా ఉద్దానంలో ఎలుగుల సంచారం అదుపు చేయాలని కోరుతున్నా అటవీశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రాణాలు పోయిన తరువాత పరిహారం అందించడానికే ఆ శాఖ పరిమితమైందని స్థానిక యువత అసహనం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో కాశీబుగ్గ పారెస్ట్ రేంజర్ మురళీకృష్ణ నాయుడు, అటవీశాఖ అధికారులు ఎం.పోలయ్య, జోగారావు, ఎ.బాబూరావు, సర్పంచ్ ప్రతినిధి దాసరి పాపారావు, గ్రామపెద్ద తిరుపతిరావు పాల్గొన్నారు.

ఇంటింటా 'సువ్వారి' ప్రచారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో గత పాలకులు అభివృద్ధిని విస్మరించి ప్రజా ద్రోహులుగా మారారని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. శనివారం పట్టణంలోని 22, 23 వార్డుల పరిధిలో లక్ష్ముడుపేట, వెంకయ్యపేటలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి దశాబ్ద కాలంగా ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు నియోజకవర్గంలో పరిపాలన కొనసాగించడంతో అభివృద్ధి కుంటుపడిందని ప్రజలకు వివరించారు. ఇప్పటికైనా కుటుంబ పాలనను అంతమొందించి ఒక్క అవకాశం తనకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పొందూరు మాజీ ఎంపిపి సువ్వారి దివ్య, సువ్వారి అనీల్ కుమార్, అన్నెపు సూర్యనారాయణ, ఎన్ని శ్రీనివాసరావు, పైడి శ్రీరాములు, ఎండ షణ్ముఖరావు, మోహన్, బలగ పోలినాయుడు, పైడి ఆనందరావు, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బెజ్జిపురం పంచాయతీ బొంతుపేటకు చెందిన వైసిపి నాయకుడు బొంతు వెంకటరావును ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. వెంకటరావు తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటరావును పరామర్శించారు. ఈయన వెంట వైసిపినాయకులు బొంతు సూర్యనారాయణ ఉన్నారు

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎన్నికల విధిలో అప్రమత్తంగా ఉండాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం, అలసత్వం తీసుకోకుండా బాధ్యతగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ సూచించారు. పట్టణంలో పిఒ, ఎపిఒలకు జరుగుతున్న శిక్షణా తరగతులను ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో చెప్పిన అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. గతంలో అనేక ఎన్నికలు చూసాను ఇది మామూలే అనుకోకుండా ఎన్నికల నిబంధనల్లో కొత్తగా వచ్చిన మార్పులు గమనించాలన్నారు. రీ పోలింగ్‌కి ఎటువంటి అవకాశం రాకూడదని, రీపోలింగ్

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న జెసి నవీన్

వచ్చిందంటే శిక్షణా తరగతుల్లో లోపాలు వల్లే పొరపాట్లు జరిగినట్లు భావించాల్సి ఉంటుందన్నారు. మళ్ళీ రెండు విడతలుగా శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. మే 12న డిస్ట్రిబ్యూషన్ ఉంటుందని, ముందుగానే పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు సరి చూసుకోవాలని సూచించారు. ఈసారి మహిళలకు పక్క నియోజకవర్గాల్లో ఎన్నికల విధులు ఉండే విధంగా వెసులుబాటు కల్పించారని, గతంలో మాదిరిగా దూర ప్రాంతాలకు డ్యూటీలు వేయడం జరగదన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర పాల్గొన్నారు.

పలాస: మే 13న జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ అన్నారు. కాశీబుగ్గ టి.కె.ఆర్ కళ్యాణ మండపం, ఎస్‌టిఒ కార్యాలయాల్లో నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎన్నికల పిఒలు, ఎపిఒలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ భరత్‌నాయక్, శిక్షణా తరగతుల ప్రత్యేకాధికారి చిట్టిరాజు, తహశీల్దార్ ఎం.వి.వి.ఎస్.నాయుడు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటా ప్రచారం

సోంపేట : ప్రచారం చేస్తున్న విజయ

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపికి ఓటు వేసి అభివృద్ధికి తోడ్పడాలని స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రజలను కోరారు. శనివారం మండలంలోని కొర్లకోటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ ఒడి, చేయూత, వాహనమిత్ర, రుణమాఫీ వంటి దాదాపు 33 సంక్షేమ పథకాలు ద్వారా పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు సీఎం జగన్మోహన్ రెడ్డి అవిశ్రాంతం శ్రమించారన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, మాజీ సర్పంచ్ సువ్వారి నేతాజీ, సైలాడ దాసునాయుడు, గురుగుబెల్లి చలపతిరావు, పేడాడ వెంకటరమణ పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీమతి రెడ్డి శాంతి పాతపట్నం లోని మండల కేంద్రంలోని జూబ్లీ రోడ్డు ఆవరణలోని పెద్ద దేవాంగవీధి, కొత్త దేవాంగవీధి, ఉప్పర వీధి, కొత్త వీధుల్లో శనివారం పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గుడ్ మార్నింగ్ పాతపట్నం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని ఉప్పలం పంచాయతీలో స్థానిక వైసిపి సమన్వయకర్త, జిల్లా పరిషత్ ఛైర్మన్ పిరియా విజయ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో సిఎం జగన్మోహన్ రెడ్డిని మరలా ఆదరించాలని కోరారు. జగన్‌తోనే సంక్షేమం ప్రజలకు అందుతుందన్నారు. ఎంపిపి దాసు, నాయకులు ఎం. రాజారావు, ఎస్.భాస్కరరావు, బి.శ్రీకష్ణ, బి.మాధవ రావు, ఎం.నరేంద్ర, ఎ.లోకనాథం, జానకిరామ్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని నగరంపల్లిలో పిఎసిఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు, పేరాడ తిలక్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇరోతు హేమంత రాజు, ఎంపిటిసి బమ్మిడి మోహనరావు, దువ్వాడ ఉమామహేశ్వర్, మామిడి గోవిందరావు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో పి.రామన్నపేట, పాలవలస, కుమ్మర వీధి గ్రామాల్లో వైసిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాంను మరోసారి గెలిపించాలని కోరారు. ఎంపిపి కె.దీప, జెడ్‌పిటిసి బి.రామారావు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ గోవిందరావు, డిసిఎంఎస్ మెంబర్ జల్లు బలరాం నాయుడు, వైస్ ఎంపిపి బి.సూర్యారావు, బి.కృష్ణమూర్తి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోగల చిట్టేవలస పంచాయతీలో

ఆమదాలవలస : ప్రచారం చేస్తున్న స్పీకర్ సీతారాం

పాతపట్నం : ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శాంతి

పలు గ్రామాల్లో సర్పంచ్ సంపతిరావు వెంకటరమణ అధ్వర్యంలో ఎంపిపి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు సత్యరాజు ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, ఎంపి అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ హేమ సుందరరాజు, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, మండల విప్ బొడ్డు అప్పన్న, వైఎస్ ఎంపిపి దుక్క రోజా, నాయకులు రామరాజు, వెంకటరావు, మెట్ట సింహాచలం, గణపతి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలో 4, 5 వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియ విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లిరావు, గేదెల సోమయ్య, బెహర, ప్రత్తి అన్వేష, సుగ్గు ప్రేమ్ కుమార్, తేజేశ్వరరావు, పరపతి కోటి, జగన్నాయకులు, పిలక సంతు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

టిడిపి విస్తృత ప్రచారం

నౌపడ : ప్రచారం చేస్తున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు

నౌపడ : మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం సంతబొమ్మాళి మండలం భావనపాడులో నిర్వహించిన టిడిపి ప్రచార కార్యక్రమంలో ఎంపీ రామ్మోహన్ నాయుడుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల పొట్టకొట్టిందని, మత్సకారులకు రావాల్సిన సబ్సిడీలు, పథకాలు నిలుపుదల చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో పవన్ కళ్యాణ్, బిజెపి భాగస్వామ్యంతో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తద్వారా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. భావనపాడులో ప్రధాన సమస్యలు డ్రైనేజీ, తాగునీరు, మత్స్యకారులకు వలలు, ఆయిల్ సబ్సిడీ వంటి వాటిని పరిష్కరిస్తామన్నారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అవినీతి, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. దోచుకున్న సొమ్ముతో ఓట్లు కొనుక్కోవాలని చూస్తున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి టిడిపిని గెలిపించుకోవాలని కోరారు. అంతకు ముందు నౌపడ మూడు రోడ్లు కూడలి నుంచి భావనపాడు వరకు బైక్‌ర్యాలీతో ప్రచారం నిర్వహించారు. భావనపాడులో సైని గురువులు, అల్లుపల్లి పోతయ్య, పలువురు ముఖ్య నాయకులకు టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టెక్కలి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కణితి కిరణ్, టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు, నాయకులు రెడ్డి అప్పన్న, అట్టాడ రాంప్రసాద్, స్వరూప్ రెడ్డి, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

సోంపేట: రానున్న ఎన్నికలే సిఎం జగన్మోహన్ రెడ్డికి చివరి ఎన్నికలని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆయనను ఇంటికి సాగనంపుతారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని ఇసకలపాలెం పంచాయతీలో శనివారం సూపర్ సిక్స్ పథకాల ప్రచార కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే అశోక్‌తో పాటు మరల తనను ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు. చంద్రబాబు నాయుడును సిఎంగా చేస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులతో పాటు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: మండలం లైదాంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.అనంత రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ రామ్మోహన్, నాయకులు కె.సత్యనారాయణ, సిహెచ్ వాసుదేవరావు, ఎ.రాము, బి.శంకర భాస్కర్, పి.రామారావు, డి.గణపతి, బాడాన శేషగిరి, సీపాన శ్రీరంగనాయకులు, చినరంగ పాల్గొన్నారు.

పొందూరు : మహిళకు పోస్టర్‌ను అందజేస్తున్న రవికుమార్

కవిటి: నిత్యం ప్రజలతో ఉంటూ, ప్రజా సంక్షేమాన్ని కోరుకునే ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను మరోసారి ఆదరించి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే భార్య నీలోత్పల కోరారు. మండలం పుక్కల్లపాలెం, జాలరిపాలెం, కొత్తపాలెం, చిన్నకర్రివానిపాలెం, బట్టివానిపాలెం, పెద్దకర్రివానిపాలెం గ్రామాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస: మందస మండలం భోగాపురం గ్రామ పంచాయతీలో టిడిపి నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష, టిడిపి ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడును అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు భావన దుర్యోధన, పోలేటి ప్రభాకర్, రట్టి లింగరాజు, దేబాసిస్ పండా, బేసి గణపతి, బేసి ఈశ్వరరావు, అగ్గన్న తిరుపతి, వాసు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు పావని

65 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- బూర్జ

మండలం రామన్నపేటలో 104 ఆధ్వర్యంలో బూర్జ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పావని 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా గర్భిణీలకు వైద్య పరీక్ష నిర్వహించి వృద్ధులకు, బాలింతలకు, చిన్నారులకు ప్రత్యేక వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరుగుతుందని, ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు బయటకు రాకుండా చల్లని ప్రదేశంలో ఉండే విధంగా చూడాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పి అలేఖ్య, ఎఎన్ఎం చిన్నమ్మడు, డిఇఒ వెంకటరమణ, కార్యదర్శులు రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ మొఖలింగం, పైలెట్ అసిరినాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పలాస

పలాస విద్యుత్ కార్యాలయం పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. శాసనం, మొగిలిపాడు, కె.టి.రోడ్డు, అన్నపూర్ణ ఆశ్రమం వీధి ప్రాంతం, కంచర వీధి, పెద్దవీధి, శ్రీనివాసనగర్, ఉదయపురం, సీతారాంనగర్, వాసుదేవపేట, హడ్కో కాలనీ, శివాజీ నగర్, సూదికొండ, లేబర్ కాలనీ, వివేకానంద కాలనీ, గాంధీనగర్, న్యూకాలనీ, ఫిష్ మార్కెట్ ఏరియా, తిలక్ నగర్, ఎస్.బి.ఎస్.వై.ఎం. డిగ్రీ కాలేజ్ రోడ్, జెడ్‌పి హైస్కూల్ రోడ్డు, పల్లివీధి, శారద నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వేసవిలో విద్యుత్ మరమ్మతులు దృష్ట్యా పనులు చేపట్టేందుకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

పాతపట్నం: ఆదివారం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాతపట్నం, మెలియాపుట్టి, హిరమ ఒడలం, కొత్తూరు మండలం నివగాం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో అన్ని గ్రామాలకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

నందిగాం : మానవహారం నిర్వహిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- నందిగాం

ఓటుహక్కు వినియోగంపై మండలంలో పలు గ్రామాల్లో ఎంపిడిఒ జి.శివప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులతో పాటు ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. ఓటుహక్కు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. విఆర్ఓ పండా, ఎపిఎం జాంబవతి, వెలుగు సిబ్బంది, సిసిలు, గ్రామైఖ్య సంఘ సభ్యులు, సిఎఫ్‌లు పాల్గొన్నారు.

కవిటి: ఓటు వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకుని ఓటింగ్ శాతం పెంచాలని ఎపిఎం గోవిందరావు అన్నారు. మండలం బొరివంకలో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుణవతి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కంచిలి: మండలంలోని శాసనం పంచాయతీ పరిధిలో అధికారులు ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓటు నీ హక్కు అంటూ నినాదాలు చేస్తూ ఫ్ల కార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎపిఎంతో పాటు మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

టిడిపిలో పలువురు చేరిక

పార్టీలోకి ఆహ్వానిస్తున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

టిడిపి కార్యాలయంలో శనివారం వజ్రపుకొత్తూరు మండలం తుంబవానిపేటకు చెందిన 27 కుటుంబాలు, మంచినీళ్ల పేట మాజీ సర్పంచ్ తులే కేశవరావు, వార్డు మెంబర్ సింగారి ఉపేంద్ర, మందస మండలం రట్టి గ్రామం నుంచి పులరి ధర్మారావు, చిన్న ధర్మారావు, పులరి రిషి తదితరులు టిడిపిలో చేరారు. వారికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుర్తం తోటమ్మ, దున్న గోపమ్మ, గుర్తం తులసమ్మ, మందరమ్మ, మామిడి తాతారావు, దాసరి తాతారావు, బమ్మిడి కరయ్య, నారాయణరావు, ముడిమించి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో శనివారం పలాస మండలం సున్నాదేవి నుంచి యువకులు మాజీ మంత్రి గౌతు శివాజీ సమక్షంలో వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణరావు, దువ్వాడ సంతోష్ కుమార్, కీలు నారాయణ, రెయ్య భాస్కర్, రెయ్య తిరుపతి రావు, గేదేల ఢిల్లేశ్వరరావు, శివంగి రాజారావు, యార్లగడ్డ వెంకన్న చౌదరి పాల్గొన్నారు.

వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం జాతీయ రహదారిలో సుబ్బారావుపేట గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతబొమ్మాళి మండలం గెద్దలపాడుకు చెందిన గొర్జల యర్రమ్మ (63) మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే యర్రమ్మ తమ కోడలు, బంధువులతో కలిసి శ్రీకాకుళంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువును పరామర్శించడానికి ఆటోలో వెళ్లి శ్రీకాకుళం నుంచి తిరుగు ప్రయాణంలో సుబ్బారావుపేట గ్రామ సమీపంలోకి వచ్చే సరికి యర్రమ్మ మల విసర్జన కోసం రోడ్డు దాటుతుండగా అదే రోడ్డులో నరసన్నపేట నుంచి కోటబొమ్మాళి వైపు వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీ కొంది. దీంతో యర్రమ్మ కాలుకు, తలకు బలమైన గాయాలు తగలడంతో చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అమె చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు స్థానిక హెచ్‌సి విశ్వేశ్వరరావు తెలిపారు. తమ కోడలు గున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గాయపడిన యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జనవరి 7న మండలం నిమ్మాడ ఎఫ్‌సి గొడౌన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమ్మిలాడ పంచాయతీ ఉప్పాడపేటకు చెందిన ఉప్పాడ ధనుంజయరావు (20) రోడ్డు ప్రమాదంలో గాయపడడం పాఠకులకు విధితమే. అయితే గాయపడిన ధనుంజరావును విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- నందిగాం

మండలం హరిదాసుపురానికి చెందిన టి.నవీన్ (27) ఈ నెల 28న ఇంటి నుంచి ఊరు శివారున ఉన్న బంజరు బంద చెరువులో స్నానానికి వెళ్లి ఎవరూ గుర్తించకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. శనివారం ఉదయం అటువైపు వెళ్లిన గ్రామస్తులు కొంతమంది నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. తల్లి సత్యమం ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీం, ఎస్ఐ రాజేష్

చాపరలో చోరీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

చాపర గ్రామంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గోకర్ల వజ్రమ్మ ఇంటికి తాళం వేసి పది రోజుల కిందట పారాడిపో వెళ్ళింది. దొంగలు ఇంట్లో సుమారు 4 తులాల చేతి గొలుసు, చైన్, నాలుగు ఉంగరాలు దొంగలించారు. శనివారం క్లూస్ టీం పరిశీలించింది. గోకర్ల వజ్రమ్మ కుమార్తె రెడ్డి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు.

పలాస : వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- పాతపట్నం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా, ఒడిశా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు నిరంతర నిఘాలో ఉందని, ఒడిశా నుంచి వచ్చే ప్రతిఒక్క వాహనాన్ని నిశితంగా పరిశీలించి పంపిస్తున్నామని పాతపట్నం ఎస్ఐ మహమ్మద్ యాసిన్ తెలిపారు. శనివారం సిబ్బందితో కలిసి ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీలు నిర్వహించారు.

పలాస: పలాస మండలం కిష్టుపురం రైల్వే అండర్ పాసేజ్ వద్ద శనివారం ఉదయం విస్తృతంగా వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో పలుచోట్ల వాహనాల్లో తనిఖీలు నిర్వహించారు. డిటి వెంకటరావు, పోలీసులు పాల్గొన్నారు.

అచ్చెన్నను కలిసిన 'ఎన్ఇఆర్'

అచ్చెన్నాయుడుతో ఎన్ఇఆర్

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును పార్టీ కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.ఈశ్వరరావు శనివారం కలిశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి కష్టపడి పనిచేసి విజయం సాధించాలన్నారు. ఈయనతో పాటు ఎచ్చెర్ల నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 22 మంది ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 22 మంది నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ తెలిపారు. కళాశాలకు చెందిన జెకెసి కెరీర్ గైడెన్స్ విభాగం, జిఎంఆర్ సెక్యూరిటీ సర్వీసెస్ విభాగం నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో 43 మంది పాల్గొనగా వీరిలో 22 మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్ కుమార్, జెకెసి కో-ఆర్డినేటర్ బి.ఝాన్సీ రాణి, ప్లేస్మెంట్ అధికారి జి.కాసవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తెరవనున్న విద్యుత్ కౌంటర్లు

శ్రీకాకుళం : ఈ నెల 31న విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం అన్ని కలెక్షన్ కౌంటర్లు తెరవనున్నామని ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.